# జాలి ఖరీదు

పాలగిరి వేణు



శ్రీమతిను ది ఖ త్తరం వచ్చింది. అర్జంటుగా ఓ వంద పంపమంటూ ..

నెల ఆఖరి వారం చేతిలో పైసా లేదు

అప్పారావును అప్పు అడిగితే "విన్ననే అడగరాద్రటా! వందేమిటి? రెండొందలు యిచ్చేవాణ్ణి" అంటూ తనకున్న మొండి చేయికూడ చూపించాడు..

అవసరానికి ఆదుకొనే అప్పారావు తనక్కూడ యింకో వంద చూడమన్నాడు నా పనిలో పనిగా...

శ్రీమతి అనవసరంగా డబ్బు గురించి రాయదు... ఎంతో అవసరమయేవుండాలి... పూర్తిగా వివరాలు రాయలేదు... చలపతిని అడిగాను... "జీతం పడుతూనే యిస్తానంటే వందేమిటి? నూట ఏభైదాకా సర్దుతానన్నాడు..."

డబ్బు యింత సులభంగా దొరుకుతుందనుకోలేదు. మొదటి తేదీ యింకా ఐదు రోజులుంది శ్రీమతికి వంద పంపితే, నా ఖర్చులకుగాను ఎలాగూ ఏభైదాకా కావాల్సి వుంటుంది

"సరే!" నంటూ చలపతి చేతులు పట్టుకున్నాను.

డబ్బు అందింది...

'టైం' చూసుకుంటే మూడు దాటుతోంది...

రిక్షా పిల్చి, 'ఆబిడ్స్'కు వెళ్ళమన్నాను. ఓ అరగంట తర్వాత 'ఆబిడ్స్'లో దిగి, చేతికందిన చిల్లర్ని రిక్షాబాబు చేతిలో పోశాను... "జనరల్ పోష్టాఫీసు"లోకి దూరాను... జనం బాగా వున్నారు. "మనీ ఆర్డర్ల" క్యూలో నిలబడ్డాను. నా ముందు ఓ ఇరవైమందిదాకా వున్నారు... ఐదు నిముషాలయ్యాక తెల్సింది, నా దగ్గర ఎమ్. ఓ. ఫారం లేదని... వెనక తిరిగి చూశాను. ఇంకో ఇరవైమందిదాకా వున్నారు... ముందువాడికీ, వెనకవాడికి మొహమాటం లేకుండా "ఫారం మరచిపోయి వచ్చాను వెంటనే వచ్చి మళ్ళీ క్యూలో కలుస్తానని" చెప్పాను... వాళ్ళు సరే నన్నారు...

కౌంటర్లో ఫారం తీసుకొని ఖాళీగానున్న ఓ టేబిల్ ముందు కూచొని నింప బోయాను...

"బాబూ!"

తలెత్తి చూశాను...

ఎదురూగ్గా... అతడికి ఏభై దాటుండొచ్చు... ముఖంలో దైన్యత్వం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది...

"ఏంకావాలండీ!"

అతడు ఏదో చెప్పబోయాడు... చెప్పలేక పోయాడు...

ఫారమ్ పూర్తిచేశాను... అక్కణ్ణించి లేవబోయాను...

"చూడు! బాబూ!!"

తిరిగి చూశాను...

"బాబూ! నాకు ఓ ఐదు రూపాయలు కావాలి... మా ఆవిడకు డబ్బు పంపాలి. అనంతపురం ఆస్పత్రిలో మా అమ్మాయిని

చేర్చారట... డబ్బు సకాలానికి పంపకపోతే ఆమె ప్రాణానికి ముప్పు రావచ్చు...నా దగ్గర ఓ వందదాకా వుంది... ''ఎమ్. ఓ. కమీషను'' తెచ్చుకోవడం మర్చిపోయాను... మేముండేది 'ఉప్పగూడ'లో... వెళ్ళి రావాలంటే చాల కష్టము...'' చెప్పబోతున్నాడు... మాటల్లో పొందికలేదు... గొంతులో ఆదుర్దా, ఆందోళన కలిసి వున్నాయి...

''నాకు ధర్మం చేయొద్దు... అప్పుగా యివ్వండి చాలు.''

ఆ మనిషిలో గొప్ప అభిమానం వుంది... చెప్తున్నది అచ్చనిజంలా వుంది... అడిగింది ఓ ఐదు రూపాయలు... ప్రస్తుత పరిస్థితుల్లో రెండు పూటలు భోజనంకూడ చేయలేమేమో ?...

మన స్తోమతకు తగ్గట్టుగా... చేసేది గొప్ప సాయంకాదు... మనిషికి విలువ యివ్వలేదు... అతడి అవసరానికి ఆదుకొన్నాను... ఒక్కోసారి తాహతుకు మించి ఆదుకోవడం మానవసహజం...

నా అడ్రస్సు అడిగాడు... ఇచ్చాను... నమస్కరించాడు...గుంపులో కల్సిపోయాడు.

ఎమ్. ఓ చేశాను. ఇంతవరకు వున్న కంగారు తగ్గింది... అతడు అక్కడ కనపడలేదు. క్యూలో చూశాను... లేడు మరి... ఏదో అనుమానం వేసింది... పోతే పోయింది వెధవ ఐదు రూపాయలు... ఆఫీసు చేరుకున్నాను...

సాయంకాలం అప్పారావు వచ్చాడు వూసులాటకోసం... మధ్యాహ్నం జరిగిన సంగతి చెప్పాను.

''నీవు నిజంగా అమాయకుడివిరా! ఒరే పిచ్చినాయనా! సరిగ్గా ఒక నెల క్రిందట నాకు యిలాగే జరిగింది. అప్పుడేమో వాళ్ళబ్బాయి కాలేజీలో చదువుతున్నాడని, ఆ రోజే డబ్బు పంపకపోతే కాలేజీ ఫీజు కట్టకపోవడంవల్ల కాలేజిలోంచి అబ్బాయిని గెంటేస్తారని... ఇప్పుడేమో కూతుర్ని ఆస్పత్రిపాలు చేశాడు. అప్పుడేమో అతడికి సాయం చేయలేదుకదా బాగా చివాట్లు మాత్రం పెట్టాను. ఇప్పుడేమో నీవు అతడికి డబ్బిచ్చి, అతగాడి కూతురు ప్రాణాల్ని నిలబెట్టావ్!... ఐదు రూపాయలంటే నీకు ఐదు పైసల్లా కనిపిస్తున్నాయనుకుంటాన్రా'' అంటూ అప్పారావు నన్ను హాస్యం చేశాడు. బాగా నవ్వడంతో వాడికి గొంతులో పొరపోయింది. నీళ్ళిచ్చేసరికి తేరుకున్నాడు...

వాడికి నేను బదులు చెప్పలేదు... నేను మోసపోయాను... కాదు తోటి మనిషికి, అతడి మానవత్వానికి విలువ నిచ్చాను... ఈ సంఘటన మరిచిపోవడానికే ప్రయత్నించాను...

రోజులు, నెలలు... మూడు సంవత్సరాలు గడిచిపోయాయి... ఆర్నెల్ల క్రితం నేను పనిచేస్తున్న ఆఫీసును మా కంపెనీవాళ్ళు దివాలా తీయడంతో మూసివేశారు. నేను నిరుద్యోగిని... గవర్నమెంటు ఉద్యోగానికి వయోపరిమితి దాటిపోయింది. మళ్ళీ ఏ ప్రవేటు కంపెనీలోనో వెదుక్కోవాలి... శ్రీమతికి నలుగురు పిల్లలతో ఆరోగ్యం దెబ్బతింది. ఆర్థికంగా నా సంసారం చితికిపోయి... రోజులు గడవటమే దుర్భరమయ్యింది... ఉద్యోగపు వేటలో అలసిపోయాను. ఉద్యోగం ఖాళీ వుందంటూ వారంనాటి పేపర్లో చూశాను. విదేశీయ సంస్థ... అప్లికేషన్‌తోబాటు ఓ ఏడు రూపాయల పోష్టల్ ఆర్డరుకూడ జతచేసి పంపాలి... చేతిలో ఒక్క రూపాయకూడ లేదు... ఉంటే ఓ అరపూట గడుస్తుందనే భావన వుంది నాలో... స్నేహితుల్ని అడిగాను... ఓ మూడు రూపాయలు పుట్టించాను. అంతకంటే వాళ్ళు యివ్వరు మరి... నేను వాళ్ళకొక ''ప్యారసైట్''ను అయిపోయాను. ఏంచేయాలో తెలియక నిరాశతో యింట్లోనే వుండిపోయాను... పోనీ అదే మూడు రూపాయలతో రెండు పూటలు గడిచేందుకు బియ్యం కోసం కొట్టుకు బయల్దేరాను. దారిలో ఎదురుగ్గా నరసింహ్మం కనిపించాడు... అతడు మా పేట పోష్టుమాన్...

''సార్! మీకో మని ఆర్డరొచ్చింది'' అంటూనే సంచిలోంచి ఫారం తీశాడు... నాకు డబ్బు ఎక్కణ్ణించీ వచ్చే అవకాశమే లేదు...ఆ వచ్చిందికూడ ఐదు రూపాయలే...

''ఇన్ని రోజులకు మీ అప్పు తీరుస్తున్నాను...క్షమించగలరు'' అంటూ ఫారమ్‌లో రాసివుంది... అంతకన్నా యింకేంలేదు...

గతమంతా కళ్ళముందు తిరిగింది... ఆ రోజు నేను చేసిన సాయం ఈ రోజు యిలా ఆదుకుంది.

డబ్బును తీసుకొని పోష్టాఫీసుకు పరుగెట్టి పోష్టల్ ఆర్డర్లు తీసుకొన్నాను. దరఖాస్తుతోపాటు వాటిని ఆ విదేశీయ సంస్థకు పంపించాను...

నెల రోజులయ్యాక ఇంటర్వ్యూ వచ్చింది. మరో వారం తర్వాత ఉద్యోగంలో చేరమంటూ ఆర్డర్లు వచ్చాయి... వెంటనే చేరిపోయాను.

ప్రస్తుతము నా జీవితము సుఖంగా వుంది... మబ్బును విడిచిన వెన్నెల్లా... ఆర్థికంగా నిలబడ్డాను... మా ఆవిడ ఆరోగ్యం బాగయ్యింది...

జీతంకూడ నాలుగంకెల పైనే వుంది...

కాని యిదంతా జాలి... ఖరీదు మాత్రమే...

